క్లుప్తంగా

నిత్యావసర సరుకుల అందజేత

శివ్వంపేట (నర్సాపూర్): బాధిత కుటుంబాలకు మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా బుధవారం ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన గుర్రాల స్వామి, కొత్తపల్లి నర్సింలు మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రూ. 5 వేలు నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో చింత స్వామి, ఆంజనేయులు, శివకుమార్, శ్రీనివాస్, వెంకటేశ్ ఉన్నారు.

సిర్గాపూర్ ఏఓగా హరికృష్ణ



కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల వ్యవసాయ అధికారిగా జి.హరికృష్ణా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ప్రభుత్వం కొత్తగా చేపట్టిన నియామకల్లో హరికృష్ణ ఏఓగా ఎంపికయ్యారు. జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు భాస్కర్, శివకుమార్, సమత, శ్వేత పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



సరుకులను పరిశీలిస్తున్న సీడీపీఓ సుజాత

నారాయణఖేడ్: మండల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని చాప్టా (కె), సిర్గాపూర్, వానర్, అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం నారాయణఖేడ్ ఇన్‌చార్జి సీడీపీఓ సుజాత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్ల నాణ్యతా, ఇతర సరుకుల వివరాలను పరిశీలించారు. అనంతరం పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆమె వెంట సూపర్‌వైజర్లు మంజుల, ప్రమీల, ప్రశాంతి, జమున, సుజాత ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఉజ్వల్‌రెడ్డి

జహీరాబాద్: కోహీర్ మండలంలోని బడంపేట గ్రామానికి చెందిన సజ్జాపూర్ నర్సింహులు అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. వైద్యం ఖర్చుల నిమిత్తం రూ.2.50లక్షల ఎల్‌ఓసీని జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధితుడికి వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేక పోవడంతో సెట్విన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డిని సంప్రదించారు. ఆయన మంత్రులు దామోదర రాజనర్సింహా, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిల సహకారంతో ఎల్‌ఓసీని మంజూరు చేయించారు.

అడ్వెంచర్‌కు విద్యార్థులు



మనాలికి బయలుదేరిన విద్యార్థులు

సంగారెడ్డి: రాష్ట్రంలోని జేఎన్టీయూ విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ అడ్వెంచర్ క్యాంపు 2024- 25 బుధవారం హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలి పట్టణానికి బయలుదేరి వెళ్లారు. మొత్తం ఆరు జేఎన్టీయూ కళాశాలకు సంబంధించిన 10 మంది విద్యార్థులు క్యాంపునకు ఎంపికయ్యారు. ప్రోగ్రాం ఆఫీసర్‌గా ఉదయ్‌రంజన్ విద్యార్థుల వెంట వెళ్లారు.అడ్వెంచర్ క్యాంపు 9 రోజులు ఉంటుందని జేఎన్టీయూ వర్గాలు పేర్కొన్నాయి.

చెకుముకి టాలెంట్ టెస్ట్



చెకుముకి టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని మాణిక్‌ప్రభు స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్టును నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన టెస్టుకు విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య మాట్లాడుతూ.. చెకుముకి టాలెంట్ టెస్ట్ వల్ల విద్యార్థుల ప్రతిభ గుర్తించేందుకు ఈ పోటీలు దోహదపడుతాయన్నారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణం

న్యాల్‌కల్ (జహీరాబాద్): స్థానిక కృష్ణ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం ఉదయం శ్రీనివాస కల్యాణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్నూర్ నాగలక్ష్మి–కృష్ణ దంపతుల ఆధ్వర్యంలో వేద బ్రహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ

- రికార్డులు, బిల్లుల పరిశీలన
- అవకతవకలుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక



రికార్డులు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ టీమ్ తదితరులు

సంగారెడ్డి: క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ కమిటీ బుధవారం జిల్లా కేంద్రం సంగారెడ్డిలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేసింది. టాస్క్‌ఫోర్స్ కమిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పుష్పవాణి ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ధరణి, స్టార్ , కీర్తి ఆస్పత్రులకు వెళ్లి వివిధ రికార్డులను తని ఖీ చేశారు. వారు అందిస్తున్న చికిత్సలకు వసూ లు చేస్తున్న రుసుములకు సంబంధించిన బిల్లులు, కేస్‌షీట్లను పరిశీలించారు. ఆస్పత్రిలో ప్రదర్శించిన ధరల పట్టికలతో పోల్చి చూశారు. వాటికి సంబంధించిన కాపీలను తీసుకెళ్లి పరిశీలించారు. నివేదికను కు టుంబ, ప్రజారోగ్య సంక్షేమ సంచాలకుడికి సమర్పిస్తామని ఆమె తెలిపారు. అందులో ఏవైనా లోపాలుంటే తగు చర్యల కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అ. దికారికి పంపిస్తామని తెలిపారు. బృందం వెంట జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రీదేవి, మాస్ మీడియా ఆఫీసర్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ రవి, స్టేట్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు సునీల్‌రాజ్, డీఎస్‌ఓ రమాదేవి, డాక్టర్లు అనిల్ కుమార్, వెంకట్ రామ్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలకు రండి



కలెక్టర్ క్రాంతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అంజయ్య

మునిపల్లి(అందోల్): నేటి నుంచి నిర్వహించనున్న గ్రంథాలయ వారోత్సవాలకు హాజరుకావాలని కలెక్టర్ వల్లూరి క్రాంతిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య ఆహ్వానించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేలా గ్రంథాలయాలను తీర్చిదిద్దుతామన్నారు. డిజిటలైజేషన్ కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు.

కొనుగోలు త్వరగా పూర్తి చేయండి

- ఆర్డీఓ అశోక్ చక్రవర్తి



కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ తదితరులు

కల్హేర్(నారాయణఖేడ్): ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి ఐకేపీ అధికారులు, నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం కల్హేర్, మార్డి, ఇందిరానగర్, మీర్ఖాంపేట్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం తూకం వేసిన వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివశ్రీనివాస్, ఆర్‌ఐ మల్లేశం, ఐకేపీ ఎంపీఎం సాయిలు, సీసీ శారద పాల్గొన్నారు.

అధికంగా తూకం వేస్తే చర్యలు

నారాయణఖేడ్: రైతుల వద్ద ధాన్యం అధికంగా తూకం వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్డీఓ జ్యోతి హెచ్చరించారు. మండలంలోని తుర్కాపల్లి, ర్యాకల్, వెంకటాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిర్దేశిత తూకం కంటే ఎక్కువ తరుగుపేరుతో తీయకూడదన్నారు. కేంద్రాల వద్ద రైతులకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించకూడదని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మి మద్దతు ధర పొందాలని సూచించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట డీపీఎం జయశ్రీరాజ్, ఏపీఎం వంశీకృష్ణ, సీసీలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ

కల్హేర్(నారాయణఖేడ్): రైతులు ధాన్యం విక్రయించే సమయంలో తేమశాతం పాటించాలని ఏడీఏ నూతన్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కృష్ణాపూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణవేణి, ఐకేపీ సిబ్బంది నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్



బహుమతి అందజేస్తున్న రమేష్

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడల మండల కేంద్రాల్లోని కేజీబీవీ పాఠశాలల్లో బాలల దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చైల్డ్ రైట్స్ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన విజేతలకు రమేష్ బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడు తూ..విద్యార్థులు చట్టాలపైన అవగాహన కలిగి ఉండాలన్నారు. చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గృహహింస బాల్యవివాహ నిషేధచట్టం పోక్సో చట్టం, వరకట్న నిషేధం, చట్టాలపైవివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు న్యాయపరమైన విషయాల్లో ఉచిత న్యాయ సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓ కవిత, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధే లక్ష్యంగా ముందుకు..

- రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి



మోడల్ స్కూల్‌లో పర్యటిస్తున్న అధికారులు

మునిపల్లి(అందోల్): విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా కృషి చేస్తున్నారని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మునిపల్లి మోడల్ స్కూల్, హాస్టల్, బుదేరా మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల, లింగంపల్లి గురుకుల పాఠశాల, తాటిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలను పరిశీలించారు. హెట్రాఫార్మ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటి ఫండ్స్) కంపెనీ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో పరిశీలించారు. సీఎస్‌ఆర్ ఫండ్స్ నిధుల ద్వారా పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించడానికి మంత్రి దామోదర రాజనర్సింహ్మా ఆదేశాలతో ఆయా పాఠశాల, కళాశాలలను పరిశీలించారు. ఆయా పాఠశాలలు, కళాశాలల నుంచి వివరాలు సేకరించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సదుపాయాలను కల్పించడానికే పర్యటించడం జరిగిందని చెప్పారు.ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి ఉపయోగపడేలా పాఠశాలలు, కళాశాలలను మంత్రి దామోదర అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి పీఏ హనుమండ్లు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లిక ఆయా పాఠశాలలు, కళాశాలల అధ్యాపకులు, మోడల్ స్కూల్ పీటీ మన్సూర్ ఉన్నారు.

లింగాకర్షక బుట్టల పంపిణీ



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రమేష్

జహీరాబాద్: రైతులకు డీడీఎస్–కేవీకేల ఆధ్వర్యంలో ఉచితంగా లింగాకర్షక బుట్టలు, వేపనూనె పంపిణీ చేశారు. బుధవారం మొగుడంపల్లి మండలం ఉప్పర్‌పల్లి తండా, న్యాల్‌కల్ మండలం మామిడ్గి, శంశల్లాపూర్, ఝరాసంగం మండలం పొట్‌పల్లి, కంగ్టి మండలం నాగూర్(కె), కిసాన్‌నాయక్ తండా రైతులకు అందజేశారు. శాస్త్రవేత్త రమేష్ మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన కంది రకం(టీడీఆర్‌జీ–59) ఫ్యూజేరియం ఎండు తెగుళ్లను తట్టుకుంటుందన్నారు. మారుకా మచ్చల పురుగు, శనగపచ్చ పురుగు నివారణకు లీటరు నీటిలో 5.మి.లీ వేపనూనె పిచికారీ చేయాలని సూచించారు. ఉధృతి ఎక్కువగా ఉంటే దశపర్ణి కషాయం, 5 లీటర్లు ఎకరాకు సరిపోయే నీటిలో పిచికారీ చేయాలన్నారు. ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలు అమర్చి పురుగు ఉధృతిని నివారించవచ్చన్నారు. ఎండు తెగుళ్ల నివారించడానికి తట్టుకునే రకాలు ఆశ, హనుమ, మారుతి, మన్యంకొండ కంది రకాలను వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో 110 మంది రైతులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం చందాపూర్ గ్రామ శివారులోని రామదూత పత్తి మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పత్తి రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జోగిపేట మార్కెట్ కార్యదర్శి జి సునీల్‌కుమార్, నర్సాపూర్ కార్యదర్శి డి ప్రతాపరుద్రగౌడ్, సీసీఐ ఇన్‌చార్జి నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి

నారాయణఖేడ్: అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. కంగ్టి మండలం రాసోల్ గ్రామానికి చెందిన బల్‌భీం (50), మనూరు పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన రెండు మూడు రోజులుగా అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బుధవారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కారు బోల్తా.. ఆరుగురికి గాయాలు

పటాన్‌చెరు టౌన్: రింగురోడ్డులో కారు బోల్తా పడి ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు కథనం ప్రకారం... రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి చెందిన యువకులు చరణ్, వివేక్, మహేందర్, చింటూ, బబ్లూ, సతీశ్‌లు కారులో మంగళవారం మొయినాబాద్ మండల్ రెడ్డిపల్లిలో జరిగిన శుభకార్యానికి హాజరై అక్కడి నుంచి అర్ధరాత్రి యాదగిరి గుట్ట వెళ్తున్నారు. మార్గమధ్యంలో ముత్తంగి స్వీట్ హార్ట్ హోటల్లో టీ తాగి అక్కడ నుంచి రింగ్ రోడ్డు మీదుగా బయలుదేరారు. సుల్తాన్‌పూర్ వద్దకు రాగానే అతివేగంగా వాహనం నడపడంతో అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో ఆరుగురు గాయపడ్డారు. స్థానికులు పటాన్‌చెరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

తాగునీటి సమస్య తీర్చిన ఎమ్మెల్యే



బోరు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్ పాఠశాలలో నీటి సమస్య తీర్చేందుకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి చర్యలు తీసుకున్నారు. పాఠశాల ఆవరణలో బుధవారం కొత్తగా బోరు వేశారు. విద్యార్థులు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. హెచ్‌ఎం సుధాకర్, నాయకులు తుకరాం కొత్తగా బోరు తవ్వకం పనులు ప్రారంభించారు. మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఎం .వీర్‌షెట్టి, సంగమేశ్వర్‌రెడ్డి, నాగయ్య పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ మృతి

న్యాల్‌కల్(జహీరాబాద్): ఉరేసుకొని ఓ మహిళా మృతి చెందిన ఘటన మండలంలోని రేజింతల్‌లో చోటు చేసుకుంది. హద్నూర్ పోలీస్‌ల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్తమ్మ, జగప్ప భార్యాభర్తలు. కొన్నేళ్లుగా పుట్టింటి వద్ద తన ఇద్దరు పిల్లలతో కలిసి ముత్తమ్మ ఉంటుంది. కొంతకాలంగా మతిస్థిమితం సరిగ్గా లేక పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తోంది. బుధవారం పత్తి తీసేందుకు వెళ్తున్నానని చెప్పగా.. కూతురు వద్దని వారించినా వినకుండా వెళ్లింది. గ్రామ సమీపంలోని చెట్టుకు చీరతో ఉరేసుకొని ఆత్మ హత్య చేసుకుంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పశువులకు సకాలంలో వైద్య సేవలు

జహీరాబాద్: పశువులకు వ్యాధులు సోకిన వెంటనే వైద్యం అందించాలని చిరాగ్‌పల్లి పశువైద్యాధికారి అజింక్యా పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఆనెగుంట గ్రామంలో డీడీఎస్–కేవీకే ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పశువులు రోగాల బారిన పడకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలన్నారు. గోపాలమిత్ర సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. పశు సంవర్ధక శాస్త్రవేత్త కైలాష్ మాట్లాడుతూ.. పాల ఉత్పత్తిని పెంచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. పశువులకు పోషకాలు కలిగిన దాణా, మినరల్ మిక్చర్ అందించాలని చెప్పారు. శిబిరంలో గర్భకోశ చికిత్సలు, కృత్రిమ గర్భధారణ, దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. అనంతరం రైతులకు మినిరల్ మిక్చర్, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ అర్జునయ్య, జేవీఓలు రాజయ్య, వెంకట్, ముబీన్, రవి, ఇస్మాయిల్, శోభమ్మ, గోపాలమిత్ర భాస్కర్, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ వేగవంతంగా కుటుంబ సర్వే

మునిపల్లి(అందోల్): సమగ్ర కుటుంబ సర్వే వేగవంతంగా జరుగుతుందని ఎంపీడీఓ హరినంధ్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాల్లో సర్వేలో భాగంగా 10 వేల కుటుంబాలకు సంబంధించి ఇళ్లను సర్వే చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 12, 825 కుటుంబాలను సర్వే చేయడం జరిగిందన్నారు. ఈ రోజు 395 కుటుంబాల సర్వే కార్యక్రమాన్ని ఎన్యుమరేటర్లు నిర్వహించారని తెలిపారు. ఇంకా చాలా కుటుంబాలను నమోదు చేయాల్సి ఉందన్నారు.

◆ ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్‌లో బుధవారం పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో అమ్మవారికి మంగళ హారతులు, నైవేద్యాలతో ప్రత్యేక హోమాలు నిర్వహించి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సంజీవ్ రెడ్డి, మాణిక్ రెడ్డి, మాధవరెడ్డి, కృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బుధవారం అందజేశారు. మండలంలోని చల్లగిద్ద తండాకు చెందిన సునీతబాయి, పోతన్‌పల్లి(ఎం)కు చెందిన రుక్కుంబాయి, కల్హేర్‌కు చెందిన అశోక్, బొక్కస్‌గాం తండాకు చెందిన నార్యానాయక్‌లకు ఆర్థిక సహాయం మంజూరయింది. కార్యక్రమంలో పరమేశ్వర్, నగేష్‌సేట్ ఉన్నారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్: మనూరు మండలం రాణాపూర్‌కు చెందిన కిష్టయ్యకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును బుధవారం డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు. నాగల్‌గిద్ద మండలం గంగారాం తండాకు చెందిన రాందాస్‌కు మంజూరైన చెక్కును కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి అందజేశారు. పెద్దఏడిగి గ్రామానికి చెందిన గంగారాంకు మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘ మాజీ సభ్యులు నగేష్ షెట్కార్ పంపిణీ చేశారు.

కల్హేర్(నారాయణఖేడ్)లో..

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ఖానాపూర్(కె)లో బుధవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కల్హేర్‌కు చెందిన అల్లం అశోక్‌కు రూ. 18,000, సిర్గాపూర్ మండలం బొక్కస్‌గాంకు చెందిన నార్యానాయక్‌కు రూ. 15,000 చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నర్సింహరెడ్డి, మాజీ ఎంపీటీసీ సంగప్ప, మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి సాయిలు, నాయకులు రాములు, గోపాల్‌రెడ్డి, పవార్ సింగ్, ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

◆ బైక్ ఢీకొని మహిళ మృతి

సంగారెడ్డి క్రైమ్: రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందిన సంఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్ పరిధిలోని వైకుంఠపురం దేవాలయం వద్ద చోటు చేసుకుంది. పట్టణ సీఐ భాస్కర్ కథనం ప్రకారం.. ఈ నెల 12న గుర్తుతెలియని మహిళ వైకుంఠపురం దేవాలయం సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద అర్ధరాత్రి రోడ్డు దాటుతుండగా సంగారెడ్డి నుంచి జోగిపేట వెళ్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు పేర్కొన్నారు.

◆ నేడు నాందేడ్‌లో బహిరంగసభ



నారాయణఖేడ్: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలతో పాటు నాందేడ్ పార్లమెంటు స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నిక జరగనుంది. ఈ క్రమంలో నాందేడ్‌లోని నాయముండా గ్రౌండ్‌లో గురువారం సాయంత్రం భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్లు నాందేడ్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ తెలిపారు. పార్లమెంటు ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ హాజరు కానున్నారని వివరించారు. బుధవారం ఆయన అక్కడ తెలంగాణ రాష్ట్ర సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి సభ ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడి కాంగ్రెస్ నాయకులతో కలిసి చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు సభను దిగ్విజయం చేసే విషయంపై వారు చర్చించారు.

◆ ఫీజు దోపిడీ అరికట్టాలి

నారాయణఖేడ్: టెన్త్ వార్షిక పరీక్షల ఫీజు పేరిట పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చేస్తున్న దోపిడీని అరికట్టాలని ఖేడ్ డివిజన్ సీపీఐ కార్యదర్శి ఆనంద్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. నిర్ణీత ఫీజు కంటే అత్యధికంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో పేద విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు చిరంజీవి, సతీష్, రాము, పుప్పాల అశోక్ పాల్గొన్నారు.

◆ మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు జరిమానా, జైలు విధించిన ఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ వివరాల ప్రకారం.. మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్ లో 21 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

CHANGE OF NAME

సీమా ఉన్నీసా, ఇం.నం. 1-195/1, మున్సిపల్ ఆఫీస్ దగ్గర, పటాన్‌చెరు (తాలుకా & మండలం), సంగారెడ్డి జిల్లా, తెలంగాణ - 502319 వాసినైన నేను నా పేరును సీమా పర్వీన్ (SEEMA PARVEEN) నుండి సీమా ఉన్నీసా (SEEMA UNNISA) గా మార్చుకున్నాను.

CHANGE OF NAME

మలెక బేగం, ఇం.నం. 1-195/1, మున్సిపల్ ఆఫీస్ దగ్గర, పటాన్‌చెరు (తాలుకా & మండలం), సంగారెడ్డి జిల్లా, తెలంగాణ - 502319 వాసినైన నేను నా పేరును మహమ్మద్ మలెక బేగం (MOHAMMED MALEKA BEGUM) నుండి మలెక బేగం (MALEKA BEGUM) గా మార్చుకున్నాను.

IN THE COURT OF THE PRL. SR. CIVIL JUDGE AT BIDAR
RA No. 23/2019.

Lalitabai died per her L.Rs ...Appellants
Versus
Ramlu and another ...Respondents
Sub : suit for declaration etc.,
To,
Respondent No.1:
Ramlu S/o Late Baburao Biradar, age about 45 years occu: private work resident of Rajampeth C/o Ganga Nursary Sangareddy, Dist. Medak-AP.
Whereas, the above named appellants, have filed the above appeal against the respondents for declaration. You have failed to put in to appearance in the instant case in spite of notice by the court and also through registered post. So this court hereby issue the notice to you calling upon you to appear in this court in person or through pleader authorized by all of you on the 16-12-2024 at Bidar at 11.00 am to answer the claim and also to produce on that day all the documents upon which you intend to rely in support of your defence.
Take notice that, in default of your appearance on the day before mentioned, the appeal will be heard and determined in your absence.
Given under my hand and the seal of the court this the 29th day of Oct 2024 at Bidar.
//By Order of the court//
Sd/- **Chief Ministerial Officer,**
Prl. Sr. Civil Judge Bidar